క్లుప్తంగా

ఘనంగా శ్రీకృష్ణుడి తీర్థ మహోత్సవం


శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీ దిబ్బపాలెంలో శ్రీకృష్ణుని తీర్థ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరిపించారు. భక్తులు ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ పరిసరాల్లో కోలాటం, నృత్య ప్రదర్శనతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని, పూజలు చేశారు. కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గం యువజన అధ్యక్షుడు ఏదూరి రాజేష్, కమిటీ నాయకులు యలమంచిలి పెద అప్పారావు, కొయ్య రాంబాబు, బొట్టా గంగరాజు, శీరంశెట్టి గోవిందరావు, యలమంచిలి బుల్లిబాబు, ఈగల రమణ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లో 11 కేవీ రాజధాని ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. రాజధాని కాటా రోడ్డు పరిసరాలు, తుంగ్లాం వైపు సాహువాలా సిలిండర్స్ రోడ్డు , సెయిల్ రోడ్డు పరిసరాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

'మహానగర్ సాంఘిక్' జయప్రదం చేయాలి

గాజువాక : నగరంలో ఈ నెల 5న నిర్వహించనున్న ఆరెస్సెస్ మహానగర్ సాంఘిక్ కార్యక్రమానికి యువత పెద్ద సంఖ్యలో హాజరై, జయప్రదం చేయాలని బీజేపీ గాజువాక కో- ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు కోరారు. పాత కర్ణవానిపాలెంలో ని బీజేపీ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరెస్సెస్ ఆవిర్భవించి 97 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆంధ్రా యూనివర్సిటీలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి గాజువాక నుంచి 500 మంది స్వయం సేవకులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ శేషు ప్రసాద్, శంకరరావు, నాగేశ్వరరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి, వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

కన్వీనర్లు, గృహ సారథులదే ఆ బాధ్యత


సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, గాజువాక పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్


సమావేశానికి హాజరైన నాయకులు, కన్వీనర్లు, గృహసారథులు

- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ప్రతిపక్ష నాయకుల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- ఎమ్మెల్యే నాగిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్

పెదగంట్యాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, మండల కన్వీనర్లపై ఉందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక నియోజకవర్గ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక బీసీ రోడ్డు టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో 64, 65వ వార్డుల గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్ల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని మండల కన్వీనర్లు, గృహ సారథులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక నాయకులతో కలసి, పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. సమర్థవంతంగా పని చేసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి తిరుగులేని విజయం అందించాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని కోరారు. అనంతరం పార్టీ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, పార్టీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, మండల క్లస్టర్ కన్వీనర్ కులుకూరి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జింగ్ టెక్నాలజీపై ముగిసిన శిక్షణ


శిక్షణ తరగతుల్లో వివిధ కళాశాలల నుంచి పాల్గొన్న అధ్యాపకులు

అగనంపూడి: ఎమర్జింగ్ టెక్నాలజీపై అధ్యాపకులకు విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సు శుక్రవారం ముగిసింది. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, గీతం డీమ్డ్ యూనివర్సిటీ సంయుక్తంగా ఈ శిక్షణను నిర్వహించాయి. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న గీతం యూనివర్సిటీ మెకానికల్ విభాగాధిపతి బి.శ్రీనివాస ప్రసాద్ మట్లాడుతూ వివిధ విభాగాలు సంయుక్తంగా పరిశోధనలు చేయడం వల్ల సత్ఫలితాలు వస్తాయన్నారు. పరిశోధనల్లో పురోగతి సాధించాలంటే మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇలా కొన్ని విభాగాల అధ్యాపకులు కలిసి పరిశోధనలు చేయడం వల్ల కొత్త ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందన్నారు. విజ్ఞాన్ కళాశాల రెక్టార్ వి.మధుసూదన రావు మాట్లాడుతూ విద్యార్థులకు బోధనతో పాటు పరిశోధనల్లో అధ్యాపకులు మార్గదర్శకులుగా వ్యవహరించి, నడిపిస్తే విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న మేధాశక్తి బయటకు వస్తుందన్నారు. వారం రోజుల శిక్షణ శిబిరాన్ని సద్వినియోగపర్చుకొని విద్యార్థులకు సదవకాశాలు కల్పించాలని సూచించారు. ముగింపు సందర్భంగా అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, కార్యక్రమ కో-ఆర్డినేటర్ బి.సతీష్, డీన్ బడే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ వర్క్స్ సీజీఎంకు అభినందన


కొత్త సీజీఎం మొహంతిని సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వర్క్స్ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) బి.కె. మొహంతిని స్టీల్‌ప్లాంట్ ఎస్‌టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అభినందించా రు. వర్క్స్ సీజీఎంగా మొహంతి బాధ్యతలు స్వీక రించిన సందర్భంగా ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లోని ఆయన కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఎం.కె. నాయక్, ప్రధాన కార్యదర్శి జి.జి. సత్యనారాయణ నాయకత్వంలో నాయకులు శుక్రవారం కలిసి, సత్కరించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పి. గురుమూర్తి, బి. ప్రదీప్ నాయక్, ఎస్.ఎస్. భూషణ్, ఎం. శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో..
స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు నూతన సీజీఎం మొహంతిను కలిసి అభినందించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కర్రి దాలినాయుడు, ఎన్వేటి రమణ, మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, అండిబోయిన అప్పారావు, జి. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణంపై గ్రామస్తుల ఆందోళన

- ఆందోళనకారులపై టవర్ నిర్మాణదారుల దాడి
- ఇద్దరికి గాయాలు


సచివాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు కాపుతుంగ్లాంలో జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మిస్తుండటంతో, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఆందోళన చేస్తున్న గ్రామస్తులపై టవర్ నిర్మాణదారులు దాడికి తెగబడటంతో, ఇద్దరు గాయపడ్డారు. గ్రామస్తులు, క్షతగాత్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కాపుతుంగ్లాం గ్రామంలో ఓ ఇంటిపై ఇండస్ టవర్స్ లిమిటెడ్ కంపెనీ ఆర్‌టీపీ సెల్‌ఫోన్ టవర్‌ను నిర్మిస్తోంది. రేడియేషన్‌తో చిన్నపిల్లలు, పెద్దల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందంటూ టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కాపుతుంగ్లాం సచివాలయం వద్ద గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో టవర్ నిర్మాణదారులు దాడికి పాల్పడడంతో ఇద్దరు గ్రామస్తులకు గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులతో కలిసి, గ్రామస్తులు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే కాపుతుంగ్లా సచివాలయ అడ్మిన్ సెక్రటరీ నవ్యకు వినతిపత్రం అందజేశారు.

ఆకట్టుకున్న 'సృజనోత్సవ్'


చిన్నారులు ప్రదర్శించిన ఫ్యూచర్ స్పేస్ సిటీ

గాజువాక : స్థానిక యాపిల్ ఐ స్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సృజనోత్సవ్ 2023 కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక, విజ్ఞాన, సాంస్కృతిక రంగాలకు సంబంధించిన 400 ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ విధానం, ఫ్యూచర్ స్పేస్ సిటీ, శ్రీకృష్ణ లీలలు, ఏకలవ్యుని జీవితగాథ, ఇండస్ వ్యాలీ సివిలైజేషన్, చైనీయుల హెరిటేజ్ అండ్ కల్చర్ తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ టి.బలరామకృష్ణ, ప్రిన్సిపాల్ పామెల ముఖర్జీ, పాఠశాల కార్యదర్శి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పులతో క్యాన్సర్‌కు చెక్


డాక్టర్ రఘునందనరావు

అక్కిరెడ్డిపాలెం: ఆరోగ్యకరమైన ఆహార నియమాలను పాటిస్తూ, జీవన శైలిలో మార్పులు చేసుకుంటే క్యాన్సర్ వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని షీలానగర్ కిమ్స్ ఐకాన్ చీఫ్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రఘునందనరావు అన్నారు. ఫిబ్రవరి 4న అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్యాన్సర్‌పై అవగాహన పెంచి, ప్రతీ సంవత్సరం మిలియన్ల మంది జీవితాలను రక్షించడమే లక్ష్యంగా యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ (యూఐసీసీ) నేతృత్వంలో ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. మద్యపానం, మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా.. నిత్యం వ్యాయామం చేస్తూ ఊబకాయాన్ని నియంత్రిస్తే క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలతోనే ఆర్థికాభివృద్ధి


722వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం, ప్రభుత్వరంగ పరిశ్రమల వల్ల ఆర్థికాభివృద్ధి విస్తరించిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. అటువంటి సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టాలనుకోవడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 722వ రోజు టీపీపీ మరియు ఆర్‌ఈడీ, పీఈఎం విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, బి.మహేష్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాలన్నారు. ఈ ఉద్యమాన్ని ప్రజా పోరాటంగా మలచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. శిబిరంలో స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాల ప్రతినిధులు శేషగిరి, బి.ఎం.ఎల్ నాయుడు, బి.వి.సత్యనారాయణ, శివవర్మ, ఎస్.కృష్ణమూర్తి, భద్రరావు, మంత్రి గోపి, నర్సింగరావు, సన్యాసిరావు, కేశవరావు, ఫణిరాజు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో భవిష్యత్తుకు మరింత భరోసా


లబ్ధిదారుకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల భవిష్యత్తుకు మరింత భరోసా కలిగించే విధంగా పథకాలు ఉన్నాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన 67వ వార్డు కొత్త గాజువాకలో ఇంటింటికీ వెళ్లి పథకాలు పొందుతున్న లబ్ధిదారులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా పథకాలు అందుతున్న విధానం, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన విధంగా పథకాలను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయనకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, సచివాలయాల కన్వీనర్ ఎస్ఎండీ గౌస్, నాయకులు పల్లా పెంటారావు, మార్టుపూడి పరదేశి, అచ్చినాయుడు, షాహిద్, నరేష్, పల్లా శ్రీను, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే ప్లాస్టిక్ నిర్మూలన


గంగవరం పోర్టు రూపొందించిన వస్త్ర సంచులను ప్రదర్శిస్తున్న జెడ్సీ సింహాచలం, పోర్టు అధికారులు

పెదగంట్యాడ: నిషేధిత ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అవసరమని గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం, గంగవరం పోర్టు మాజీ సీఈవో ఎస్.సాంబశివరావు అన్నారు. ప్రభుత్వం, జీవీఎంసీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సే నో టు ప్లాస్టిక్ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ శానిటరీ సిబ్బందికి శుక్రవారం యాప్రాన్లు పంపిణీ చేశారు. అలాగే ప్రజలకు నార, వస్త్ర సంచులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా చైతన్యంతోనే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించగలమన్నారు. గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ఇప్పటికే పలుమార్లు బీచ్ క్లీనింగ్ చేపట్టామని చెప్పారు. భావితరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, గంగవరం పోర్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ దేవేందర్ ఠక్కర్, మాజీ ఎస్పీ అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం


మంటలార్పుతున్న అగ్నిమాపక దళ అధికారులు

పెదగంట్యాడ: మండలంలోని గంగవరం గ్రామంలో శుక్రవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైంది. సుమారు రూ.1.50లక్షల ఆస్తి నష్టం సంభవించింది. పెదగంట్యాడ అగ్నిమాపక దళ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగవరం గ్రామంలోని ఓ పూరింట్లో వాసుపల్లి దేముడు, పేర్ల పోలేరమ్మ నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో, ఈ ప్రమాదంలో రూ.60వేల నగదు, అరతులం బంగారం, దుస్తులు, మంచం తదితర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే పెదగంట్యాడ అగ్నిమాపక దళ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని అధికారులు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న సీతారాం

పెదగంట్యాడ: ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం హెచ్చరించారు. 76వ వార్డు రామచంద్రనగర్‌లోని ప్రియదర్శిని పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఫీజుల వివరాలతో కూడిన బోర్డు లేకపోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. వెంటనే బోర్డును అక్కడ ఏర్పాటు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలల హక్కులకు భంగం కలిగించవద్దన్నారు. సెలవు దినాల్లో తరగతులు పెట్టి విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి నీలవేణి, సూపర్‌వైజర్ స్రవంతి, వివిధ శాఖల అధికారులు ఆర్.శ్రీజ, నాగ ప్రియాంక, వరలక్ష్మీ, త్రివేణి, సీఆర్పీఎఫ్ గాజువాక కార్యదర్శి సనపల ఢిల్లీ పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలి

నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సంచాలకురాలు విజయరావు


గిరిజన విద్యార్థులతో నెహ్రూ యువకేంద్రం రాష్ట్ర సంచాలకురాలు విజయరావు

మహారాణిపేట: భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై యువత అవగాహన పెంచుకోవాలని నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సంచాలకురాలు ఎ.ఆర్. విజయరావు సూచించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, యువజన క్రీడా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నెహ్రూ యువ కేంద్రం, విశాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న 14వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ముగింపు కార్యక్రమం శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా విజయరావు మాట్లాడుతూ సభ్యత సంస్కారానికి, సంస్కృతి,సంప్రదాయలకు భారతదేశం నిలయమన్నారు. అందుకే మనదేశం మిగతా దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. యువత సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. గత నెల 28వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, బస్తర్, కంకేర్, నారాయణపూర్, రాజ్‌నంద్‌గావ్ జిల్లాలు, జార్ఖండ్‌లోని గుమ్లా, కుంటి, లోహ ర్దగా, లతేహార్ జిల్లాలు, ఒడిశా రాష్ట్రంలోని ఖండమాల్ జిల్లాల నుంచి 220 మంది గిరిజన యువతీ యువకులు పాల్గొన్నారు. విశాఖలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, కైలాసగిరి, సబ్‌మెరైన్ మ్యూజియం, ఆర్.కె.బీచ్ తదితర ప్రాంతాలను వారు సందర్శించారు. ముగింపు కార్యక్రమంలో విశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.రామ్‌నరేష్, సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిల్లా యువజన అధికారి జి.మహేశ్వరరావు, విజయనగరం జిల్లా యువజన అధికారి జి.విక్రమాదిత్య, ఇతర అధికారులు ఎం.సి.బాబురెడ్డి, శ్రీనివాస్, రాంప్రసాద్, వి.పి.దేవి పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం


మాట్లాడుతున్న కె.ఎస్.మల్లేశ్వరి

కూర్మన్నపాలెం : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి, దేశం గర్వపడేలా తీర్చిదిద్దడమే ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం ముఖ్య లక్ష్యమని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ కార్యదర్శి కె.ఎస్.మల్లేశ్వరి అన్నారు. శని,ఆదివారాల్లో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం పురస్కరించుకుని జీవీఎంసీ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెంలోని ఓ హోటల్‌లో శుక్రవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 4,5 తేదీల్లో ఉక్కు నగరం సమీపంలోని దేశపాత్రునిపాలెం సంస్కృతి గ్లోబల్ హైస్కూల్‌లో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం ఘనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో పాటు కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ వేదికలో రెండు తెలుగు రాష్ట్రాల రచయితలు, కవులు, సాహితీవేత్తలు పాల్గొంటారన్నారు. కవులు, రచయితలు మమత, సత్య, గోపి మాట్లాడుతూ వ్యాసం, కథ, కవిత్వం, పాట, ప్రక్రియలపై విద్యార్థుల మనోభావాలను పంచుకోవడం సంతృప్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ సమన్వయకర్త మానస ఎండ్లూరి, ఏపీటీఎస్ రాష్ట్ర నాయకులు వెంకటపతిరాజు, సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, కథా రచయిత దగ్గుబాటి పద్మాకర్, చిన్నపిల్లల కథా రచయిత అనిల్ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి తెలుగు టాకీ సినిమా భక్త ప్రహ్లాద విడుదలై 91 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు టాకీ సినిమా ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రతి రోజూ సాయంత్రం 5.45 గంటల నుంచి పలు చిత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ నెల 6న జమున నటించిన..ఉండమ్మా బొట్టు పెడతా, 7న మాలపిల్ల, 8న విరాటపర్వం సినిమాలు ప్రదర్శించనున్నట్టు చెప్పారు. ప్రవేశం ఉచితమని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు , వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవాధ్యక్షుడు ఎన్ఎడీ పాల్, సభ్యులు సంతోష్‌కుమార్, డాక్టర్ బాబ్జి పాల్గొన్నారు.

ఫిల్మ్ మేకింగ్‌పై వర్క్‌షాపు..
ఫెస్టివల్‌లో భాగంగా ఫిల్మ్‌మేకింగ్‌పై 7న ఉదయం 10 గంటలకు పౌరగ్రంథాలయంలో ప్రముఖ సినీ దర్శకుడు వీఎన్ ఆదిత్య (మనసంతా నువ్వే ఫేం) వర్క్‌షాప్ నిర్వహించనున్నారని నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ వర్క్‌షాపునకు 18ఏళ్లు దాటిన వారు అర్హులని, మరిన్ని వివరాలకు 9441571581, 9032477463 నంబర్లలో సంప్రదించవచ్చు.

ప్రగతిశీల ఆలోచనలతో కేంద్ర బడ్జెట్

- వర్సిటీలకు జీఎస్టీ నుంచి మినహాయింపు కల్పించాలి
- ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ప్రగతిశీల ఆలోచనలతో కేంద్ర బడ్జెట్ రూపొందించారని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన 'యూనియన్ బడ్జెట్-2023' చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయాలకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వడం, కొంత వెసులుబాటు కల్పించడం ఎంతో అవసరమన్నారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పనకు కేంద్రం ప్రత్యేక దృష్టి సారించడం శుభ పరిణామమన్నారు. ఇది ప్రగతిశీల ఆలోచనగా నిలుస్తుందన్నారు. భవిష్యత్ అంతా సాంకేతిక విప్లవం, సవాళ్లకు ఆస్కారం ఉంటుందన్నారు. దీనికి అనుగుణంగా యువతరం తమను తాము మెరుగుపరచుకోవాలని సూచించారు. ఏయూలో స్కూల్స్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని స్కూల్‌గా మార్పు చేస్తామన్నారు. నూతనంగా ఇంక్యుబేషన్ సెంటర్ నెలకొల్పి, స్టార్టప్ కల్చర్‌ను ప్రోత్సహిస్తామన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎ.కిశోర్‌బాబు, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, సింహపురి వర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య ఆర్.సుదర్శనరావు, చార్టెడ్ అకౌంటెంట్ ఆకుల చంద్రశేఖర్, పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య డి.ప్రభాకరరావు, ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డీసీఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి కేంద్ర బడ్జెట్‌పై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

కేశాల విరాళం అభినందనీయం

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి


క్యాన్సర్ రోగులకు కేశాల విరాళం ఇచ్చిన వారితో మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు కేశాలు విరాళం ఇవ్వడం అభినందనీయమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం హెల్త్‌సిటీలోని హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రిలో కేశాల విరాళ కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు నగరానికి చెందిన కొందరు మహిళలు వారి కేశాలు విరాళంగా అందించారు. వీరిలో ఇద్దరు చిన్నారులు కూడా ఉండటం విశేషం. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. క్యాన్సర్‌ను నయం చేయడానికి ఆధునిక పద్ధతుల్లో అన్ని రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ధైర్యంతో ఉండాలని.. అలాంటప్పుడే వ్యాధిని అధిగమించగలరన్నారు. హెచ్‌సీజీ ఆంకాలజీ విభాగం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.